క్లుప్తంగా

దాతల సహకారం.. ఆలయానికి రూపం!



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉలిగమ్మ దేవాలయం

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో దాతల సహకారంతో ఉలిగమ్మ అమ్మవారి ఆలయం రూపుదిద్దుకుంది. ఏళ్ల కిందట నిర్మించిన గుడి శిథిలావస్థకు చేరడంతో తొలగించారు. రూ.40 లక్షలు వెచ్చించి నూతన గోపురం, గర్భగుడి, ప్రధాన ద్వారాన్ని శిల్పకళా నైపుణ్యానికి అద్దంపట్టేలా నిర్మించారు. ప్రాంగణంలో ధ్వజ స్తంభం ఏర్పాటు చేశారు. అమ్మవారి ప్రతిమను చిక్‌బళాపుర్ నుంచి తీసుకొచ్చారు. ఆలయాన్ని బుధవారం ప్రారంభించనున్నారు. 3న అంకురార్పణం, ప్రదోషక పూజ, నవగ్రహ హోమం, వాస్తు హోమం, అమ్మవారి జపం, జలధివాస హోమాలు, 4న చండీ హోమం, అమ్మవారి గ్రామోత్సవం, దీక్షాహోమం, 5న ఉలిగమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, పూజ ప్రతిష్ట, కలశ ప్రతిష్ట, ధ్వజ స్తంభ ప్రతిష్ట, అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

జూనియర్ సివిల్ జడ్జిగా దుర్గా కళ్యాణి



ఉరవకొండ: ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జిగా దుర్గా కళ్యాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మేజిస్ట్రేట్‌గా దుర్గా కళ్యాణి ఉరవకొండకు వచ్చారు. దాదాపు రెండేళ్ల నుంచి ఉరవకొండ కోర్టుకు రెగ్యులర్ జూనియర్ సివిల్ జడ్జి లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లతో కోర్టు నడిచేది. ఇన్నాళ్లూ అనంతపురానికి చెందిన జూనియర్ సివిల్ జడ్జి ఓంకార్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు.

ఆధార్ లింక్ వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి కేశవనాయుడు

రాయదుర్గం రూరల్: బోగస్ ఓట్ల నివారణలో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఓటర్ గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను వేగవంతం చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. కేశవనాయుడు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమావేశ భవనంలో తహసీల్దార్ మారుతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు, సలహాలిచ్చారు. ఓటర్ ఐడీ ఆధార్‌కు లింక్ చేయడంలోని వివిధ దశలను ఆయన వివరించారు. ఓటర్ కార్డుతో ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేయడం వల్ల ప్రయోజనాల గురించి తెలిపారు కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, ఎన్నికల సీనియర్ సహాయకులు రామాంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గమ్మ జాతర



బోనాలు మోసుకెళ్తున్న మహిళలు

కుందుర్పి: మండంలోని కదరంపల్లిలో మంగళవారం గ్రామ దేవత దుర్గమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, గంగపూజ, మధ్యాహ్నం మహిళలు బోనాలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి గ్రామశాంతి ఉత్సవం చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కదరంపల్లితో పాటు మండలపల్లిలో చిత్ర లింగేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా చేపట్టారు.

అంకాలమ్మ దేవి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించిన దృశ్యం

వజ్రకరూరు: మండల కేంద్రంలో మంగళవారం నూతనంగా నిర్మించిన ఆలయ ంలో కుమ్మనమాల అంకాలమ్మదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వి.కె.కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ

నాడు..



అంబాపురం రోడ్డు దుస్థితి

నేడు..



పూర్తయిన తారురోడ్డు

నాడు..



అధ్వానంగా మలపనగుడి- సిద్దాపురం రోడ్డు

నేడు..



తళతళలాడుతున్న తారురోడ్డు

కణేకల్లు – బళ్లారి మార్గం మధ్యలో అంబాపురం గ్రామానికి చేరే ప్రధాన రహదారి దారుణంగా దెబ్బతిని అధ్వానంగా ఉండేది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా గ్రామానికి సరైన దారి లేక ఇన్నాళ్లు మట్టిరోడ్డే దిక్కైంది. ఇటీవల గ్రామంలో పర్యటించిన విప్ కాపు రామచంద్రారెడ్డి రోడ్డు దుస్థితిని గమనించి, ప్రజల కష్టాలు అర్థం చేసుకున్నారు. రూ.1.46 కోట్ల నిధులు మంజూరు చేయించి 2.65 కిలోమీటర్ల వరకు తారు రోడ్డు వేయించారు.

డి హీరేహాళ్ మండలంలోని సిద్దాపురం నుంచి మలపనగుడి వరకూ ఇన్నాళ్లూ బండిజాడను తలపించేలా మట్టిరోడ్డు మాత్రమే ఉండేది. దారి పొడునా ఇరుపక్కలా కంపచెట్లు పెరిగి ప్రయాణికుల పాలిట నరకకూపంగా మారింది. ఈ కారణంగా ఇక్కడ వివాహ సంబంధాలు కలుపుకోవడానికి కూడా వేరే గ్రామాల వారు వెనుకడుగువేసేవారు. విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవతో రూ.కోటి నిధులతో 2 కిలోమీటర్ల వరకూ తారు రోడ్డు పూర్తిచేయించారు.

- నియోజకవర్గ వ్యాప్తంగా చురుగ్గా సాగుతున్న రోడ్డు పనులు
- ఏఎంసీ, ఏఐఐబీ, ఉపాధి ద్వారా రూ.51.74 కోట్లతో 137 కిలోమీటర్లు పూర్తి
- మరో రూ.37.99 కోట్లతో 99 కిలోమీటర్లు కొనసాగుతున్న నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామీణులు

రాయదుర్గం: నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులకు మహర్దశ వచ్చింది. గ్రామాలు, ప్రధాన రహదారులను కలుపుతూ పలు రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. గత టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన కాలవ శ్రీనివాసులు రోడ్ల మరమ్మతుపై నిర్లక్ష్యం వహించారు. తట్టెడు మట్టి కూడా చల్లకపోవడంతో బీటీ రోడ్లన్నీ దారుణంగా దెబ్బతిని ప్రయాణికుల పాలిట నరకకూపంగా మారాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యాక్రమాలకు వెళుతున్న విప్ కాపు రామచంద్రారెడ్డి రోడ్ల దుస్థితి గమనించి మరమ్మతులకు సత్వర చర్యలు చేపట్టారు.

గ్రామీణ 'దారి'ద్ర్యం వీడేలా పనులు..

విప్ రోడ్ల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి తీసుకెళ్లి రోడ్ల అభివృద్ధికి నిధులు రాబట్టేలా కృషి చేస్తున్నారు. గతమెన్నడూ లేని విధంగా పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.90 కోట్ల వ్యయంతో 236 కిలోమీర్ల మేర రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు తారు రోడ్డే ఎరగని పల్లెలకు సైతం తళతళ మనిపించేలా పనులు సాగిస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోనూ రూ.51.74 కోట్ల వ్యయంతో 137 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణాలు పూర్తికాగా, మరో రూ.37.99 కోట్ల వ్యయంతో 99.18 కిలోమీటర్ల దారుల నిర్మాణాలకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో గ్రామీణ జనం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధే లక్ష్యం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రాయదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా రోడ్ల మరమ్మతుకు పెద్ద ఎత్తున శ్రీకారం చుట్టాం. పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో సుమారు ఇప్పటికే రూ.100 కోట్లకు పైగా రోడ్ల అభివృద్ధికే ఖర్చుచేశాం. నియోజకవర్గంలో మట్టిరోడ్డన్నదే కనిపించకుండా అభివృద్ధి చేసేలా కంకణం కట్టుకున్నాం. అలాగే జీఓ నెంబర్ 59 ద్వారా మరో 12 రోడ్ల అభివృద్ధికి రూ.22 కోట్లకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో ఈ పనులు కూడా పూర్తి చేయించేలా కృషి చేస్తాం. గత టీడీపీ హయాంలో మంత్రిగా ఉన్న కాలవ బీటీ రోడ్ల అభివృద్ధిని గాలికొదిలేశాడు. దోపిడీకే కాలమంతా సరిపెట్టాడు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బ్రహ్మసముద్రం: ఆశావర్కర్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. వడదెబ్బ, ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలపై ఆయన అవగాహన కల్పించారు. అనంతరం ఆయన ఆశావర్కర్లకు యూనిఫాం(చీరలు) పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలాజీ, పీహెచ్ఎన్ మేరీ, సూపర్‌వైజర్ రామలక్ష్మి, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్‌కు నివాళి

ఉరవకొండ: మాజీ ఎమ్మెల్యే గోపీనాథ్ 10వ వర్ధంతి సందర్భంగా వశికేరి గోపీనాథ్ చారిటబుల్ ట్రస్టు తరఫున కురుబ సంఘం రాష్ట్ర నాయకుడు వశికేరి మల్లికార్జున అధ్వర్యంలో మంగళవారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా వజ్రకరూరు జెడ్పీటీసీ వశికేరి తేజశ్విని, నాయకులు వశికేరి రమేష్, వశికేరి మల్లికార్జున, లింగమూర్తి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి సన్నిహితుడిగా ఉంటూ ఉరవకొండ నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీసీల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేశారన్నారు. అలాగే రాష్ట్ర గొర్రెల, మేకల ఫెడరేషన్ చైర్మన్ ఉంటూ బడుగు, బలహీన వర్గాల వారి సంక్షేమానికి కష్టపడ్డారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్ 'కు భారీ స్పందన



సర్వే రిపోర్టును చూపుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు

ఉరవకొండ: రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్ మోగా సర్వేలో ఏడు లక్షలకు పైగా వైఎస్సార్‌సీపీ సైనికులు పాల్గొన్నారని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగనన్నే మా భవిష్యత్ ముగింపు కార్యక్రమం నియోజకవర్గానికి చెందిన జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా మండలాల వారీగా నిర్వహించిన మోగా పీపుల్స్ సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయనతో కలిసి ఉరవకొండ టౌన్, రూరల్, విడపనకల్లు, వజ్రకరూరు, కూడేరు, బెళుగుప్ప మండలాల జేసీఎస్ కన్వీనర్లు బళ్లారి ఆసీఫ్, తేజోనాథ్, భరత్‌రెడ్డి, రాచన్నగౌడ్, దేవేంద్ర, దుద్దేకుంట రామాంజనేయులు మాట్లాడుతూ ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఏప్రిల్ 7 నుంచి 29వ తేదీ వరకూ నిర్వహించిన సర్వేలో 89,635 కుటుంబాలకుగానూ 76,899 కుటుంబాలను సందర్శించారన్నారు. 86శాతం ఇళ్లను జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు విజయవంతంగా పూర్తి చేశారన్నారు. ఇందులో 59,991 మంది చేత మిస్డ్‌కాల్స్ ఇప్పించారన్నారు. ప్రజలు జగనన్న పాలనకు మద్దతుగా తీర్పును ఓటు ద్వారా వెలువరించడం ఖాయమన్నారు. జగనన్నే మా భవిష్యత్ విజయవంతం కావడంతో విపక్షాలు షాక్‌లో ఉన్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజా సంక్షేమం పట్ల ఉన్న చిత్తశుద్ధిని ప్రజలంతా నమ్ముతున్నారన్నారు. దుష్టచతుష్టయం ఎన్ని దుష్ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మడం లేదన్నారు. ఎక్కడా అవినీతి లేకుండా పారదర్శకంగా పాలన సాగుతోందని ప్రజలు పూర్తిగా నమ్ముతున్నారని, అందుకే ఇంత మంచి స్పందన వచ్చిందన్నారు సంక్షేమం, అభివృద్ధి చూసి ఓర్వలేక పచ్చపత్రికలు, టీవీలు నిత్యం ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇళ్లకు స్టిక్కర్లు కుడా ప్రజలే దగ్గరుండి వేయించుకున్నారన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కులమత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా ప్రజలు నిలుస్తారని పీపుల్స్ మోగా సర్వే ద్వారా స్పష్టం అయిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం రాష్ట్ర చరిత్రలో సరికొత్త అధ్యాయమని, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికే ప్రజలు మద్దతు తెలిపినట్లు జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గ్రామసచివాలయ కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 13,694 కుటుంబాలను నేరుగా కలసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నామన్నారు. మరోసారి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలని ప్రజలు మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారన్నారు.

వైభవంగా కల్యాణోత్సవ పూజలు



శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ఆలయానికి తీసుకువస్తున్న గ్రామస్తులు

బెళుగుప్ప: మండలంలోని ఎర్రగుడి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం శివపార్వతుల కల్యాణోత్సవ పూజలు ఘనంగా ప్రారంభించారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని ఇటీవల దాతల సహకారంతో గ్రామస్తులు పునర్నిర్మించారు. ఆలయ జీర్ణోద్ధరణ తరువాత గ్రామశాంతి, పాడి పంటల వృద్ధికి శివపార్వతుల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని మూడు రోజుల పాటు చేపట్టారు. ఉత్సవంలో భాగంగా మొదటి రోజు మంగళవారం ధ్వజారోహణ, గణపతి పూజ, ఉత్సవ విగ్రహాలకు ఏకదశవార రుద్రాభిషేకం, మంటపారాధన, గణపతి, ఆయుష్య, నవగ్రహ, శాంతి హోమాలను నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటలకు శివపార్వతుల కల్యాణోత్సవం, సాయంత్రం ఊరేగింపు చేపటడతారు. గురువారం వసంతోత్సవ కార్యక్రమాలను వేద పండితు బూదిలి మఠాధిపతి శంకర్‌స్వామి, సాంస్కృతిక విద్వాన్ శశాంక్ హిరేమఠ్ నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పరామర్శ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం జెడ్పీటీసీ బొమ్మయ్య కుమారుడు గౌతమ్ రాజ్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ మౌక్తికాపురంలోని జెడ్పీటీసీ ఇంటికి వెళ్లి ఆయన కుమారుడిని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి వెంట నాయకులు భాస్కర్‌రెడ్డి, శివలింగారెడ్డి, ఆంజినేయులు, గంగాధర్, నగేష్ నాయక్, వెంకట్రాముడు నాయక్, మల్లికార్జున, శీనప్ప, మాధవయ్య, మారెప్ప తదతరులున్నారు.

ప్రయాణం ఇక సాఫీగా..



కమలపాడు వద్ద గ్రావెల్‌తో రోడ్డును బాగుచేస్తున్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని కమలపాడు గ్రామస్తుల దారి కష్టాలకు తెరపడింది. కొద్దిరోజులుగా ఉరవకొండ–గుంతకల్లు ప్రధాన రహదారినుంచి కమలపాడు గ్రా మానికి వెళ్లే రహదారి దెబ్బతిని గుంతలు పడటంతో వాహనదారులు, ప్రజలు రా కపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గ్రామస్తులు ఉరవ కొ ం డ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మా జీ ఎమ్మెల్యే తక్షణమే స్పందించి రోడ్డును బాగుచేయాలని అధికారులు, ప్రజాప్ర తినిధులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీ నిధులతో రెండురోజులుగా గ్రావెల్‌తో రోడ్డు బాగు చేసి మెరుగుపరచారు. దీంతో వాహనదారులు, ప్రజల రా కపోకలకు ఇబ్బందులు తొలగిపోయాయి. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కా ర్య దర్శి వెంకటరెడ్డి దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. దెబ్బతిన్న రోడ్డు మెరు గు ప డటంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తంచేశారు.

నవరత్నాలే నవశకానికి నాంది



కంబదూరు: రాంపురంలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్



కళ్యాణదుర్గం: మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌ను సన్మానిస్తున్న పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నాయకులు

కంబదూరు: నవరత్నాలే నవశకానికి నాంది పలికాయని..ప్రభుత్వం అందించే ప్రతి సంక్షేమ పథకం పేదల పాలిట వరంగా మారిందని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని రాంపురం, ఎర్రమల్లేపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. మంత్రి మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ఏమి కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టు ప్రజలు ప్రదక్షిణలు చేసే వారన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను వలంటీర్ల ద్వారా ఇంటి ముంగిటకే అందజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరింత మేలు జరగాలంటే సీఎం జగనన్నను మరోసారి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, సర్పంచ్‌లు చెన్నయ్య, శివ, లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ మారెన్న, నాయకులు నూతిమడుగు రామ్మోహన్, గౌరన్న, ముత్యాలు, వెంకటేశులు, మధుసూదన్, ఆంజనేయులు, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు దేవేంద్రపురం తండాలో..

కంబదూరు మండలంలోని దేవేంద్రపురం తండాలో మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 6 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలరాజుయాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

మంత్రికి ఘన సన్మానం

కళ్యాణదుర్గం: పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంగళవారం మంత్రి ఉషశ్రీచరణ్‌ను వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. వైఎస్సార్‌సీపీ నిర్వహించిన 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయిలో 5వ స్థానం, జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచిన మంత్రిని కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా వైఎస్సార్‌సీపీ మెగా పీపుల్స్ సర్వే చేపట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. అనంతరం మంత్రిని బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ బీసీ రమేష్ గౌడ్, మైనార్టీ సెల్ నాయకుడు సైపుల్లా, ఎస్సీ సెల్ నాయకుడు ఎగ్గుల శ్రీనివాసులు, మహిళా విభాగం నాయకురాలు శ్రీదేవి, యూత్ నాయకుడు ఉమ్మడి మదన్ మోహన్‌రెడ్డి సత్కరించారు.

చిత్రలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

కుందుర్పి: మండలంలోని మండలపల్లిలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన చిత్రలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాల్లో రాష్ట్ర స్త్రీశిశుసంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ పాల్గొని స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ రాధాస్వామి, నాయకులు పెద్దప్పయ్య, భీమప్ప,మాజీ సర్పంచ్ పూజారి భీమప్ప, అప్పిలేపల్లి సర్పంచ్ అతావుల్లా, మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి,వాల్మీకి డైరెక్టర్ పాలాక్షి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సత్కారం



డీడీని అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమి

ఉరవకొండ: ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి ఉత్తమ పశుసంవర్థక ఉపసంచాలకుని అవార్డును అందుకున్న ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డీడీ వెంకటేశ్‌ను మంగళవారం కలెక్టర్ గౌతమి అభినందించి సత్కరించారు. ఈసందర్భంగా డీడీ తమ డివిజన్ పరిధిలో పశువులకు అందుతున్న వైద్యం, పాడి రైతులకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో ఉరవకొండ డివిజన్ డీడీకి అవార్డు రావడం పట్ల కలెక్టర్ ప్రశంసించారు.

భూసార పరీక్షలు చేయించుకోండి



మట్టి నమూనాలు సేకరించే విధానంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రాయదుర్గం రూరల్: రైతులు ప్రతి మూడేళ్లకోసారి భూసారపరీక్షలు చేయించుకోవాలని కళ్యాణదుర్గం కృషివిజ్ఞాన్ కేంద్ర శాస్త్రవేత్తలు డా.మల్లికార్జున, డా.యుగంధర్ సూచించారు. మండలంలో వాటర్ షెడ్ గ్రామమైన డి.కొండాపురం లో వారు మంగళవారం పర్యటించి భూ నమూనా సేకరణలు, పత్తి పంట సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. భూపరీక్షల వల్ల నేల స్వభావం తెలుసుకునే వీలుంటుందని తెలిపారు. తద్వారా ఎరువుల వాడకం , అనుగుణమైన పంటలు వేసుకుని లాభాలు అర్జించవచ్చన్నారు. అలాగే పత్తి పంటను ఆశించే ఆకుమచ్చ, నల్లమచ్చ తెగుళ్లు , బూజు తెగులు నివారణ కోసం వాడాల్సిన రసాయన మందులు, పిచికారి చేసే మోతాదు విధానంపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ పీఓ శ్రీవిద్య, టీఓఐ ఈరన్న, రైతులు పాల్గొన్నారు.

పాపం.. పశువులు!

రాయదుర్గంటౌన్: పట్టణంలో యజమానుల నిర్లక్ష్యం కారణంగా రోడ్లు, వీధుల్లో సంచరిస్తున్న పశువులు కొన్ని అనారోగ్యం పాలవుతుండగా మరికొన్ని మృత్యువాత పడుతున్నాయి. ఇటీవల ప్రధాన రహదారులతో పాటు వీధుల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. పశువుల సంచారంతో వాహనదారులు, పాదాచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై వేదిలేస్తున్న యజమానులు వాటిని పట్టించుకోకపోవడంతో అవి అనారోగ్యం పాలవుతున్నాయి. ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తిని మృత్యువాత పడుతున్నాయి. అంతేకాక ఎండవేడిమికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతునానయి. తాజాగా పట్టణంలోని దబ్బడి కాంప్లెక్స్ ఏరియాలో నాలుగు రోజుల క్రితం ఒక అవు మృతి చెందింది. సమస్య తీవ్రత తెలిసి కూడా మున్సిపల్ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి పశువులను గోశాలలకు పంపాలని సర్వత్రా డిమాండ్ చేస్తున్నారు.

'కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలి'

కుందుర్పి: కృష్ణా బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా గ్రహీత చల్లాకిషోర్ చౌదరి కోరారు. మంగళవారం కుందుర్పిలో సామాజిక చైతన్య బృందం పర్యటించి పాలనా సౌలభ్యంరీత్యా కృష్ణ నీటి యాజమాన్యం బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతూ లేక రాసినట్లు ఆయన తెలిపారు. సభ్యులు లింగప్రసాద్, ఓబుళరాజు, రాజశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హరి, బీఎస్ఎన్ఎల్ జేఈ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె బీటలు వారిన దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 14వ వార్డు పరిధిలో ఎన్టీఆర్ కాలనీకి వెళ్లే రహదారిలో ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం ప్రమాదకరంగా మారాయి. దిమ్మె బీటలు వారి పడిపోయే స్థితికి చేరుకుంది. స్తంభం కూడా రోడ్డుపై వాలి ఎప్పుడు పడుతుందో అని కాలనీవాసులు భయాందోళనలు చెందుతున్నారు. అధికారులు స్పందించి ప్రమాదం జరగక ముందే ట్రాన్స్‌ఫార్మర్‌ను మరోచోటకు తరలించాలని కాలనీవాసులు కోరారు.